కథ

# వంచనకి ఎన్ని రూపాలు?

పులిపాక కనకదుర్గ

"లవ్వూ, లస్టూ రెండూ ఒకటే అక్షరంతో మొదలవుతాయి."

అమ్మాయి బెదిరిపోయింది. భయంతో అందమైన పెద్ద కళ్లు రెపరెపలాడాయి.

"కానీ, ఆ రెండూ ఒకటి కాదు" అమ్మాయి వంక చిలిపిగా చూస్తూ పూరించేడు అబ్బాయి.

అమ్మాయి మనసు కుదుటపడింది.

అల్లల్లాడిన కళ్లు నిర్మలమయ్యేయి.

"మరంత మాత్రానికి బెదరగొట్టడం ఎందుకో?" చిరుకోపంగా అంది.

"ఎందుకంటే రేపటిరోజున ఎవరయినా తమరిని నా ప్రేమలో నిజాయితీ లేదని, ఉత్తి ఆకర్షణ మాత్రమేనని బెదరగొట్టకుండా ముందుజాగ్రత్త పడటం అన్నమాట."

"ఎవరో ఎందుకు నేనే అడుగుతున్నాను చెప్పండి. మీది నిజమైన ప్రేమేనని, ఆకర్షణ కాదని ఎలా నమ్మటం?"

"హతవిధీ! నా ప్రేమనే శంకిస్తున్నావా?" గుప్పెటతో నుదుటిమీద సుతారంగా కొట్టుకుంటూ నాటకీయంగా అన్నాడు అబ్బాయి.

ఈ నయగారాలను నమ్మేది లేదన్నట్టుగా అమ్మాయి బింకంగా ఉండిపోయింది.

"ఆర్నెల్లుగా ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. ఏక్టివ్ టైం అంతా ఆఫీసులోనే గడిచిపోతోంది. ఆ వ్యవధి చాలదా నేనెలాంటివాడినో గమనించటానికి? నిన్ను తప్ప వేరు స్త్రీని కన్నెత్తి చూడనే, అది చాలా నా ప్రేమలోని నిజాయితీని కొలవటానికి?" దీనంగా అన్నాడు అబ్బాయి.

అమ్మాయి మనసు కాస్త మెత్తబడింది.

"సరే ఆ విషయాన్ని కాసేపు పక్కన పెడదాం. అసలు నన్నెందుకు ప్రేమించారు? నాలో ఏం నచ్చి ప్రేమించారో చెప్పండి?" ప్రేమ పరీక్షకు నాంది అన్నట్టుగా ప్రశ్నను సంధించింది.

అబ్బాయి కొద్ది క్షణాలు సమాధానం చెప్పలేనట్టుగా మౌనంగా ఉండిపోయాడు. "మరీ కఠినమైన ప్రశ్న అడిగానా?" ఎంత దాచినా దాగని చిలిపితనం తొణికిసలాడింది అమ్మాయి గొంతులో.

ఈ మారు అబ్బాయి మౌనంగా ఉండిపోలేదు. గొంతు సవరించుకుని చెప్పేడు "నాకు వర్షం అంటే ఇష్టం. ఎందుకంటే చెప్పలేను. అర విరిసిన గులాబీ అంటే మక్కువ ఎక్కువ. ఎందుకంటే సమాధానం నాకూ తెలియదు. అలాగే అందమంతా ప్రోగుచేసినట్టుండే నువ్వంటే ఎందుకిష్టం అంటే ఏం చెప్పను? రాయంచ లాంటి నడక ఇష్టమని చెప్పనా, నీ నడత నచ్చిందని చెప్పనా? నువ్వంటే ఎందుకిష్టం అంటే చెప్పలేను. కానీ చచ్చేంత ఇష్టమని చెప్పగలను. ఆ ఇష్టం సిన్సియర్ లవ్ అన్నది నిజం. లస్ట్ కాదన్నదీ నిజం."

అమ్మాయి ప్రశ్నకు సమాధానం దొరకలేదుగానీ అబ్బాయి మనసు అర్థమయ్యింది. అర్థమయ్యి మనసు ఆర్ధ్రమయ్యింది.

ఆర్నెల్లయింది అమ్మాయికి బ్యాంకులో ఉద్యోగమొచ్చి. అప్పటి నుంచి తనకంటే వయసులోనూ, సర్వీసులోనూ అయిదేళ్లు సీనియర్ అయిన అబ్బాయిని గమనిస్తూనే ఉంది. ఏదో ఒక వంకన తన దగ్గరకు రావటం అర్థమవుతూనే ఉంది. తను కనిపించగానే అబ్బాయి కళ్లల్లో మెరుపు కనిపిస్తూనే ఉంది.

అబ్బాయి ఫీలింగ్స్‌ని అమ్మాయి మొదట్లో ఖాతరు చెయ్యలేదు.

అమ్మాయికి ఎన్నో ఆశయాలున్నాయి. అందమైన అభిరుచులున్నాయి.

ఇంకా పై చదువులు చదివి సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వాలన్నది అమ్మాయి ఆశయం. అమ్మాయికి అదేమంత కష్టసాధ్యమైన విషయం కాదు. ఏ తరగతిలో అయినా అమ్మాయే క్లాస్ ఫస్ట్.

అలాగే అమ్మాయికి నాట్యం అంటే ప్రాణం. చిత్రలేఖనం అంటే చచ్చేంత ఇష్టం. ఎప్పటికయినా ఆ రంగాలలో ప్రావీణ్యత గడించి ఉన్నతస్థితికి వెళ్లాలన్నది ఆమె అభిలాష. పైపెచ్చు అమ్మాయిదింకా పచ్చిపసుపుకొమ్ము లాంటి ఇరవై వసంతాల ప్రాయమే.

అందుకే అబ్బాయినీ, అతగాడి ఆరాటాన్నీ గమనించనట్టే ఉండిపోయింది.

కానీ, అబ్బాయి అంతటితో వదిలిపెట్టదల్చుకోలేదు.

అమ్మాయిని నీడలా వెంటాడాడు.

ప్రేమభిక్షను అర్థించాడు.

అమ్మాయి విసిగిపోయి కసిరికొట్టింది.

అయినా అబ్బాయి మనసు మార్చుకోలేదు. మనసు దోచిన చిన్నదాని ప్రేమార్చన మానలేదు.

బాడీగార్డు ఉద్యోగం వదులుకోలేదు.

కాలం గడిచేకొద్దీ అబ్బాయి ప్రయత్నాలు ముమ్మరమయ్యేయి.

అమ్మాయి మనసు కొద్దికొద్దిగా మారటం ప్రారంభించింది. అబ్బాయి ప్రేమ, ప్రేమ కోసం అతను చేస్తున్న భగీరథ యత్నం ఆమె మనసుని కదిలించాయి. కానీ సివిల్స్ సాధించాలనే ఆశయాన్ని, చిత్రకారిణి, నాట్యకారిణి కావాలన్న అభిలాషను పక్కకు పెట్టాలంటే కళ్ల నీళ్లొచ్చాయి.

"దానిదేముంది? పెళ్లయిన తరువాత ఇవన్నీ సాధించినవారు ఎంతమంది లేరు?" భరోసాగా అంది సాటి సీనియర్ ఉద్యోగిని.

ఎట్టకేలకు అమ్మాయి మనసు అబ్బాయి వేపు మొగ్గింది.

ఓ అందమైన, ఆహ్లాదకరమైన సాయంత్రం అబ్బాయితో మాట్లాడటానికి అంగీకరించింది.

అబ్బాయి ఎగిరి గంతేసినంత పని చేశాడు.

అలా పార్కులో ఇద్దరూ కలుసుకున్నారు.

పూదోటలో అందమైన పూలతో పాటు పూబాలలా మెరిసిపోతూ, కలిసిపోయిన ఆమెని మైమరిచిపోయి చూస్తున్నాడు అబ్బాయి.

అమ్మాయి మనసులో అబ్బాయి ప్రేమ పట్ల, అతనితో పంచుకోబోయే భవిత పట్ల అంతులేని సందేహాలు. అందుకే సంకోచిస్తూనే తన సందేహాలను అబ్బాయి ముందు పరిచింది.

"లవ్వూ, లస్టూ ఒకే అక్షరంతో మొదలవుతాయి. కానీ ఒకటి కాదు. అలానే ప్రేమ, ఆకర్షణ ఒకేలా అనిపిస్తాయి కానీ వేరు వేరు. నా ప్రేమ నిజమైనది. ఆకర్షణ కాదు" దీనంగా, ధీమాగా చెప్పాడు అబ్బాయి.


అమ్మాయి మనసు మెత్తనయ్యింది. ఆమెకు తెలియకుండానే అబ్బాయికి మచ్చికయ్యింది.

అమ్మాయి సందిగ్ధం అబ్బాయి గ్రహించేడు.

వివాహానంతరం కూడా ఆమె ఆశయ సాధనకు కృషి చేసుకోవచ్చని ధైర్యం చెప్పాడు. ఆమె అభిలాషకు తాను అభ్యంతరం చెప్పనన్నాడు. అడ్డు రానన్నాడు.

అమ్మాయి మనసు మైనపుముద్దలా కరిగిపోయింది.

ఆశయం, అభిలాష అబ్బాయి ప్రేమ ముందు



చాలా చిన్నవిగా కనిపించాయి.

మనసు అంతకు మునుపే పరవశమయ్యింది. మేను సైతం అతని వశమవ్వాలని పరవశంలో మైమరపుకు లోనయ్యింది. చెంపలు కెంపులయితే, కన్నులు అలవిమాలిన సిగ్గుతో క్రిందకు వాలిపోయేయి.

అబ్బాయికి అర్థమయ్యింది తను ప్రేమపరీక్షలో విజేతనని. ఇహ పెళ్ళికి ఏ ఆటంకాలు లేవని.

అబ్బాయి లేచి నిలబడి అమ్మాయికి చేయి అందించాడు.

అబ్బాయి ఆసరాతో అమ్మాయి కూడా అతని సరసన నిలబడింది.

ఇద్దరూ పార్కుకి వచ్చి మూడు గంటలు దాటినట్టుంది. పూర్తిగా చీకట్లు కమ్ముకున్నాయి.

అమ్మాయి లేత నడుము చుట్టూ చెయ్యి వేసి నడిపించటం మొదలుపెట్టాడు అబ్బాయి.

అమ్మాయి అభ్యంతరం చెప్పలేదు. అబ్బాయికి విధేయంగా ఉండటమే తన విధి అన్నంత ఒద్దికగా, బిడియంగా ఉండిపోయింది.

అబ్బాయి అల్లరి అంతటితో ఆగలేదు.

అబ్బాయి సరస సల్లాపాలను అమ్మాయి ఇష్టంగా సహించింది, సహకరించింది.

అమ్మాయి నాజూకు అందాలు, లేలేత తళుకులు, సున్నితమైన మనసు పూర్తిగా అబ్బాయి వశమయ్యాయి. ఇప్పుడు అమ్మాయి పూర్తిగా పరాధీన.

అలా అబ్బాయి అమ్మాయి మీద పూర్తి ఆధిపత్యం సాధించాడు.

ఆ తరువాత కొద్ది కాలానికే వారి వివాహమయ్యింది.

అమ్మాయి పేరు హరిత అయితే ఆ అబ్బాయి వేణు.

ooo

సెకండ్ ఏసి చల్లదనం హాయిగా ఉంది.

అయిదేళ్ల తరువాత హైదరాబాద్‌కు వస్తున్నందుకు ఉద్విగ్నంగా అనిపించింది.

సైడ్ అప్పర్ బెర్తు నాది.

ఎదురుగా లోయర్ బెర్త్‌ల మీద శ్రీమతి నిమిష, అమ్మాయి ప్రియ ఉన్నారు.

డిస్టబెన్స్ లేకపోవటం వల్ల మనసు ఉల్లాసంగా అయిదు సంవత్సరాలు వెనక్కు వెళ్లింది.

హరిత నాకు కజిన్. సొంత పిన్ని కూతురు. తనకు అన్నయ్యలు, నాకు చెల్లెళ్లు లేకపోవటం వల్ల తన పెళ్లి నా చేతుల మీదుగానే జరిగింది.

ముందుగా పిన్ని, బాబాయిలు హరిత ప్రేమను అంగీకరించలేదు.

"అదింకా చిన్నపిల్ల. అప్పుడే పెళ్లేమిటి? అయినా హరి తను మంచి పొజిషన్లో చూడాలని మా కోరిక. తనింకా మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. అవసరమయితే ఫారిన్ పంపించటానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మరో మూడేళ్ల వరకూ హరితకు వివాహం చేసే యోచన మాకు లేదు" ఖరాఖండిగా చెప్పాడు బాబాయ్.

"మాకున్నది ఒక్కతే కూతురు. మంచి సంబంధం చేయాలని ఎప్పటి నుంచో కలలు కంటున్నాం. ఇహ వేణూ సంగతంటారా, అతనిది సాధారణమైన ఉద్యోగం. పైగా దిగువ మధ్యతరగతికి చెందిన పెద్ద కుటుంబం. అలాంటి కుటుంబంలో హరిత ఇమిడిపోగలదా, సుఖపడగలదా" అంటూ పిన్ని కూడా ససేమిరా అంది.

"ఏమిటమ్మా హరీ ఐ.ఏ.ఎస్ నీ జీవిత ధ్యేయం అన్నావు. ఇప్పుడేమో ఉద్యోగంలో చేరి ఆర్నెల్లు కూడా కాలేదు. అప్పుడే లక్ష్యాన్ని పక్కకు పెట్టి ప్రేమా, పెళ్లి అంటున్నావు" హరితతో నాకున్న చనువుతో మందలించకుండా ఉండలేకపోయాను.

"అన్నయ్యా నాదంటూ నాకంటూ ఏం మిగిలిందని నేనిప్పుడు పునరాలోచించగలను. నా సర్వస్వం వేణూయే. అతనితో వివాహం జరగటం మినహా వేరు గత్యంతరం లేదు" తలదించుకుని చెప్పింది హరిత.

విషయం పూర్తిగా అర్థమయ్యింది.

పిన్ని, బాబాయ్‌లను ఒప్పించేసరికి తల ప్రాణం తోకకొచ్చినంత పనయ్యింది.

అలా వేణు, హరితల వివాహమయ్యింది.

పెళ్లయిన కొద్దికాలం తరువాత ప్రేమమైకం వదిలి హరిత తిరిగి చదువు మొదలుపెడుతుందని ఆశించాం.

కానీ, మా అందరి అంచనాలు తప్పుని తేలిపో

యింది.

హరితకు వేణుయే సర్వస్వం.

వేణు బాధ్యతలు తన బాధ్యతలుగా, వేణూ సంతోషమే తన సంతోషంగా భర్తతో మమేకం అయ్యింది.

నెల పూర్తి కాగానే జీతం తెచ్చి వేణూ జీతంలో పొయ్యటంతో మొదలుపెట్టి వేణూ ముగ్గురు చెల్లెళ్ల పెళ్లికి మాగ్జిమమ్ లోన్లు తీసుకొని తనకొచ్చిన ఆస్తులని కూడా తెగనమ్మి వేణూ బాధ్యతలను పంచుకొంది.

హరిత గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు తనది మంచితనం అనుకోవాలో, అమాయకత్వం అనుకోవాలో మాకు అర్థమయ్యేది కాదు.

ఆశయానికి మొదలే నీళ్లొదిలిపెట్టింది.

కాకపోతే తమ భర్తతో సంతోషంగా ఉందన్న విషయం ఒక్కటే మాకూ, పిన్ని బాబాయ్‌లకు సంతృప్తిని కలిగించిన విషయం.

అయిదేళ్లు తిరిగేసరికి ఇద్దరు బిడ్డల తల్లయ్యింది హరిత.

అదిగో అప్పుడే నాకు గుర్‌గాం ట్రాన్స్‌ఫరయింది.

అప్పట్నించి మా మధ్యన సాన్నిహిత్యం పలుచనయ్యింది. దాదాపు ఏడాది కావస్తోంది హరితను చూసి. తిరిగి ఇన్ని రోజుల తరువాత నా బంగారు చెల్లిని చూడబోతున్నందుకు మనసు ప్రఫుల్లమానమయ్యింది.

సర్‌ప్రైజ్ చేద్దామని ట్రాన్స్‌ఫర్ విషయం ఫోన్‌లో చెప్పకుండా బయలుదేరాం. ముందే చెప్పి మా సొంత ఫ్లాట్‌ని టెనెంట్ చేత వెకేట్ చేయించటం వల్ల ఎకామడేషన్ గురించిన బాధ కూడా తప్పింది.

ఎప్పుడెప్పుడు హరితను చూద్దామా అన్న తహతహ తెలిసినట్టుగా ట్రెయిన్ శరవేగంతో పరుగులు తీస్తుంది.

ooo

నేను చూస్తున్నది హరితనేనా అన్న అనుమానం కలిగింది.

శోకదేవతలా ఉంది.

దైన్యానికి ప్రతిరూపంలా ఉంది.

దుఃఖానికి నిలువుటద్దంలా ఉంది.

వేణు ఇంత క్రూరంగా ప్రవర్తిస్తాడని కలలో కూడా ఊహించలేదు.

హైదరాబాద్ రాగానే ఆదరాబాదరా ఇల్లు సర్దుకుని ఉరుకులు పరుగుల మీద హరిత ఇంటికి వచ్చేము.

ఎంతో సంతోషంగా ఉన్న హరితను చూస్తామనుకున్నాము. కానీ, ఇక్కడ పరిస్థితి మా ఆశలకు విరుద్ధంగా ఉంది.

ఏడాది అయ్యిందిట వేణు భార్యాబిడ్డల దగ్గరకు వచ్చి. పైగా కోర్టులో విడాకుల కేసు నడుస్తోంది.

హరితను కదిలిస్తే ఉలుకు పలుకు లేదు.

పిన్ని, బాబాయ్‌లను చూస్తుంటే హృదయం తరుక్కుపోయింది. వ్యథకు మారుపేరులా ఉన్నారు.

హరిత పిల్లలిద్దరూ తండ్రి లేక, ఉన్న తల్లి మనుషుల్లో లేక బిక్కమొహాలతో ఉన్నారు.

పిన్ని చెప్పినదాన్ని బట్టి వేణు మరొక స్త్రీకి దగ్గరయ్యి హరితకు పూర్తిగా దూరమయ్యాడు.

మొదట్లో చాటుమాటుగా సాగిన వ్యవహారం బహిర్గతమయ్యి నిలదీసేసరికి ఏడాది నుంచి ఇల్లు విడిచి వెళ్లిపోయి హరితకు దూరమయ్యాడు.

ఒక్కక్షణం నేను విన్నదాన్ని నేనే నమ్మలేకపోయాను.

హరితను ఎంతగానో ప్రేమించి, వెంబడించి పెళ్లికి ఒప్పించిన వేణు ఇలా ప్రవర్తిస్తాడంటే నమ్మశక్యంగా లేదు.

నమ్మశక్యంగా లేకపోయినా జరిగింది మటుకు వాస్తవం.

మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే దిగజారిపోయిన హరిత ఆర్థిక స్థితి. ఆడపడుచుల పెళ్లిళ్లకని, కుటుంబ పోషణకని చేసిన అప్పులు, తీసుకున్న లోన్లూ హరితను ఆర్థికంగా కృంగదీశాయి. పైగా వేణు జీతం కూడా లేదు.

ఉండబట్టలేక వేణు జీవితంలోని మరొక స్త్రీ గురించి వాకబు చేశాను.

ఆమె యామిని.

సాధారణమైన అందగత్తె.

అయితేనేం అసాధారణమైన జాణతనం, మగవాడిని దాసోహం చేసుకోగల హొయలు ఆమె స్వంతం. మంచి ఉద్యోగం ఉన్న వేణూని నేర్పుగా వలపన్ని వశపరుచుకుంది.

మొదట్లో వేణు ఆమె పట్ల సుముఖంగా లేకపోయినా క్రమంగా, యామిని హొయలుకి పూర్తిగా దాసోహమయ్యేడు. ఇద్దరు పిల్లల తల్లయిన హరిత మీద ఆకర్షణ పూర్తిగా నశించింది అతనికి.

ప్రేమ ఇంత బలహీనమయినదా అని అనిపించింది అంతా తెలిశాక.

అయినా హరితను వంచించటానికి వేణుకు మనసెలా అంగీకరించిందో అర్థం కాలేదు. భర్తని నమ్మి సర్వస్వం అర్పించింది. అతని ప్రేమ కోసం జీవిత ధ్యేయాన్ని వదులుకుంది. అతని బాధ్యతలను తన బాధ్యతలుగా భావించి పుట్టింటి ధనాన్ని కూడా వెచ్చించింది. సంపాదన అంతా అతని చేతుల్లో పోసింది. అంతటి ప్రేమమయి అయిన ఇల్లాలి ఉసురు వేణు ఎలా తీయగలుగుతున్నాడో తెలియటం లేదు.

వేణూని కలిసి అన్నీ అడిగి కడిగేశాను.

సమాధానం చెప్పలేదు వేణు.

"నాకు సమాధానం కావాలి" కఠినంగా రెట్టించాను.

"యామిని లేకుండా నేనుండలేను" క్లుప్తంగా చెప్పేడు.

"ఒకప్పుడు హరితతో కూడా ఇదే మాట అన్నట్టున్నావ్" వ్యంగ్యంగా అన్నాను.

వేణూ నించి సమాధానం లేదు.

"ఎందుకని ఇలా ప్రియురాలి మీద వ్యామోహం ఇల్లాలి మీద అనురాగం కంటే ఎక్కువ ఉంటుంది?"

నా అభిప్రాయం మరి రెండు రోజుల్లో మార్చుకోవల్సి వచ్చింది.

సివియర్ డిప్రెషన్, ఫిజికల్ వీక్‌నెస్‌ల కారణంగా రెండు రోజుల తరువాత హరితను హాస్పిటల్లో ఎడ్మిట్ చేయాల్సి వచ్చింది. మత్తుగా బెడ్ మీద పడున్న హరితను చూస్తే గుండె కలుక్కుమంది.

అక్కడే సరిత పరిచయమయ్యింది.

నిమిష మాటల్లో సరిత కథ-



## తెరకెక్కుతున్న ప్రేమకథ!

శింబు-నయనతారల ప్రేమాయణం ఆమధ్య ఎంతగా పాపులరయిందో అందరికీ తెలుసు. శింబు నుంచి తనకు రక్షణ కావాలని కూడా నయనతార మొర పెట్టుకుంది. తాజాగా శింబు నటిస్తున్న 'కెట్టవన్' అనే సినిమా 'నయనతార-శింబు'ల మధ్య జరిగిన అసలు కథకి సినిమా రూపమే అంటున్నారు చెన్నయ్ సినీజనాలు. ఈ సంగతిని శింబు కూడా ఇండైరెక్ట్‌గా ఒప్పుకుంటున్నాట్ట. ప్రేమించిన మగాడు ఆడదాని వల్ల ఎలా మోసపోతాడో ఈ సినిమాలో చూపించబోతున్నారట. నిజంగా సినిమా వాళ్ల కథతోనే తయారైతే మరి సినిమా రిలీజ్ అయ్యాక నయనతార రియాక్షన్ ఎలా వుంటుందో?

సరిత, సామంత్‌లది అన్యోన్యమైన దాంపత్యం.

సామంత్‌ది మంచి ఉద్యోగం. పైగా కాస్త కలిగిన కుటుంబం. ఒక్కడే కొడుకు కావటం వల్ల సామంత్ ఇష్టపడ్డ సరితను ఇచ్చి పెళ్లి చేశారు సామంత్ తల్లిదండ్రులు.

సరితది అసాధారణమైన అందం.

రెండు సంవత్సరాలు ఇద్దరూ స్వర్గపుటంచుల దాకా విహరించారు. ఆనందాన్ని చవిచూశారు. వారి ఆనందం చూసి విధికి కూడా కన్నుకుట్టింది.

గుండెపోటుతో సామంత్ హఠాన్మరణం పాలయ్యాడు.

సరితకు తీరని షాక్ అది.

ఆకుచాటు పిందెలా భర్తచాటున జీవితాన్ని గడిపిన సరితకు భవిత అంధకారమయ్యింది. ఆ సమయంలోనే ఆమెను ఆదుకున్నాడు నందన్.

నందన్ సామంత్‌కు కొలీగ్.

సామంత్‌కు సంబంధించిన టర్మినల్ బెనిఫిట్స్ అన్నీ సెటిలయ్యే వరకూ అంతా అతనే చూసుకున్నాడు.

మొత్తం ఇరవై లక్షలు.

సామంత్ తల్లిదండ్రులు కూడా కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఆస్తిలో సగభాగం సరిత పేర రిజిష్టర్ చేసి మనసు కుదుటపరుచుకుని మరొక మనువు చేసుకొనమని చెప్పి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

కొద్ది రోజులు సరితతో గడిపి యు.ఎస్.లో ఉన్న కూతురి దగ్గరకు శాశ్వతంగా వెళ్లిపోయారు.

దారి తెన్ను లేనిదయిపోయింది సరిత.

ఒంటరితనం. ఎక్కడో మారుమూల పల్లెటూర్లో వృద్ధులయిన తల్లిదండ్రులు, నిరంతరం బాధించే భర్త జ్ఞాపకాలు. ఏడ్చిఏడ్చి కన్నీరు ఇంకిపోయింది.

కొద్ది నెలలు దుర్భర వేదన అనుభవించింది. ఒకటి రెండుసార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేసింది.

ఆ సమయంలోనే ఆమెకు బాసటగా నిలిచాడు నందన్. తానూ భార్య నించి విడిపోయానని బొంకాడు.

మనసు మళ్లితే తప్ప వేదన తొలగదని గ్రహించింది సరిత. అదను కోసం చూస్తున్న నందన్ పెద్దగా శ్రమించకుండానే సరితను లోబర్చుకున్నాడు.

కొంతకాలం ఇద్దరూ సర్వాన్ని విస్మరించి జంటపక్షుల్లా ఆనందించారు.

ఆ నోటా, ఈ నోటా విషయం నందన్ భార్య దాకా వెళ్లింది.

విషయం తెలుసుకున్న నందన్ భార్య స్తుతి భర్తను నిలదీయలేదు. అలాగని అతనిని విడిచి వెళ్లలేదు. సరిత గురించి వాకబు చేసింది. ఆమెకు దాదాపు యాభై లక్షల దాకా ఆస్తి ఉందని అంచనా వేసింది.

సరయిన సమయం చూసుకుని భర్త దగ్గర విషయం కదిలించింది.

భర్త సౌఖ్యమే తనకు ముక్తిదాయకమన్నది. సరిత వల్ల నందన్ సుఖపడితే అంతకుమించి తనకు కావల్సింది లేదంది. నందన్‌కు అడ్డుగా తాను ఉండబోనని, జీవితాన్ని అంతం చేసుకుని అడ్డు తొలగుతానని కావల్సినంత కన్నీరు కార్చింది. కాకుంటే బిడ్డలు తల్లి లేని వారవుతారేమోనని బెంగ నటించింది.

స్తుతి యుక్తికి, ఎత్తుగడకు పూర్తిగా చిత్తయిపోయేడు నందన్.

దేవత లాంటి భార్యకు అన్యాయం చేసినందుకు కుమిలిపోయేడు. మనసులో శీలం లేని సరితను అసహ్యించుకున్నాడు. 'ఇప్పుడు తనకు లోబడింది. ఇంతకు మునుపు ఎంతమందికి చేరువయ్యిందో?' సరితను అసహ్యించుకుంటూనే స్తుతిని చూసి గర్వించాడు. ఇకముందు సరిత పేరు ఎత్తనని భార్యకు మాటిచ్చాడు.

స్తుతికి కావల్సింది అది కాదు. అందుకే నేర్పుగా మాటలను కూర్చింది.

"నాకోసం మీ సౌఖ్యాన్ని త్యాగం చేయవద్దు. చెల్లాయిని కూడా మనతోనే ఉందనిద్దాం. తనకూ తోడుగా ఉన్నట్టుంటుంది. పిల్లలకూ ఆర్థికమైన అండ దొరికినట్టవుతుంది. అన్నింటినీ మించి మీ సౌఖ్యమే నాకు ముఖ్యం."

ఏ స్త్రీ అయినా భర్తను మరొక స్త్రీతో పంచుకోటానికి అంగీకరించదు. అలాంటి నైచ్యానికి దిగజారిన స్తుతి, నందన్ కళ్లకు దేవతలా కనిపించింది. నందన్ భార్య అతనితోనే ఉందని తెలుసుకున్న సరిత అతన్ని క్షమించింది.

ఆ తరువాత సరిత కూడా నందన్‌తో పాటు అతని కుటుంబంలో కలిసి ఉండసాగింది.

కొద్ది కాలానికే సరిత బ్యాంక్ బ్యాలెన్స్‌కు రెక్కలొచ్చాయి. భర్తను పంచి ఇచ్చిన అరుదయిన ఔదార్యం కల స్తుతి పేర పది లక్షలు, నందన్ పిల్లలు ఎలానూ తన పిల్లలే కాబట్టి చెరి అయిదు లక్షలు పిల్లల పేర వేసింది.

సరిత అమాయకత్వం ఇంచుకయినా నందన్ హృదయాన్ని కదిలించలేదు.

దేవత లాంటి భార్య పట్ల ప్రేమ, గౌరవం రెట్టింపయ్యాయి.

సంవత్సరం తిరక్కుండా అత్తమామలు పంచి ఇచ్చిన ఆస్తిని కూడా పోగొట్టుకుని మరోసారి సర్వస్వం కోల్పోయింది సరిత.

కొద్ది రోజులకే నందన్ ఆశ్రయం కోల్పోయింది సరిత.

రోడ్డున పడ్డ సరితను అసహ్యించుకునేవారే తప్ప ఆదరించేవారే కరువయ్యారు.

ఆ పరిస్థితుల్లోనే సరిత కూడా సివియర్ డిప్రెషన్‌తో హాస్పిటల్లో ఎడ్మిట్ అయ్యింది. కన్నకడుపు కాబట్టి తల్లిదండ్రులు మటుకు సరిత పక్కన ఉన్నారు.

హరిత పక్క బెడ్డే సరితది.

అసలే వ్యథాభరితమైన మదిని హరిత విషాదగాథ మరింత కలచివేసింది.


ఇల్లాలిగా హరిత దగా పడితే, ప్రియురాలిగా సరిత వంచించబడింది.

'ఎందువల్ల?'

'అమాయకత్వమా?'

'నమ్మకంతో తను సర్వస్వం అర్పించటం వల్లా?'

వంచనకి ఎన్ని రూపాలు?



## సూపర్ స్టార్లు వుండరిక

ఇక బాలీవుడ్‌లో సూపర్ స్టార్ అనే మాట ఏ ఒక్కరికో ప్రత్యేకంగా నిర్ధారించలేకపోవచ్చు అని సెలవిచ్చాడు షారుఖ్ ఖాన్. మారిపోయిన పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తులో ఫలానా హీరో సూపర్ స్టార్ అని కాకుండా ఎవరికి వారే సూపర్ స్టార్లుగా చెలామణీ అయ్యే తీరు కనిపిస్తోంది, అంటూనే బహుశా బాలీవుడ్‌లో నేనే చివరి సూపర్ స్టార్‌ని కావచ్చు- అంటూ తన గురించి కాస్త దప్పు కొట్టుకున్నాడు.